క్లుప్తంగా

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పొన్నూరు: ఈ నెల 8వ తేదీన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం 6న శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని కోరారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.10 లక్షలు స్వాహా

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన హేమంత్‌కుమార్ టెలిగ్రామ్ యాప్‌లో టాస్క్ ఆపరేట్ చేశాడు. అందులో టాస్క్‌పెట్టి పూర్తి చేస్తే డబ్బులు ఇస్తామని చెబుతారు. టాస్క్ నిర్వాహకులు చెప్పిన విధంగా పలుమార్లుగా రూ. 10 లక్షలు చెల్లించాడు. మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ




తెనాలిఅర్బన్: ట్రైబల్స్ మినిస్ట్రీస్ అధ్యక్షురాలు రావూరి అంజలి ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని గిరిజనులకు గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంటూరి విజయభాస్కర్, దోనేపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా నక్షత్ర శాంతి మహాయజ్ఞం



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ విద్యా పీఠం, సాలిగ్రామ మఠం ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ నవగ్రహ సహిత శ్రీ నక్షత్ర శాంతి మహాయజ్ఞం 22వ రోజైన గురువారం ఘనంగా నిర్వహించారు. మృగశిర నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు జరిపించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య, కావూరు సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, విజయలక్ష్మి మాతృమండలి సభ్యులు గోపు ప్రభారాణి, గుర్రం పద్మ, పెనుగొండ ప్రమీల, కనికచర్ల జానకి, వసంత, గౌరి పాల్గొన్నారు. మాసశివరాత్రి అయినందున పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులతో మేలు



తెనాలిరూరల్: భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులతో ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ తెలిపారు. మండలంలోని బుర్రిపాలెం, తేలప్రోలు గ్రామాల్లో సాగుదారులకు కౌలురైతు గుర్తింపు కార్డులపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను కౌలు రైతులకు వివరించారు. భూ యజమానులు పొందే ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతింటే గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ సహాయం లభిస్తుందని చెప్పారు. వీఆర్‌వోలు లేదా రైతు భరోసా కేంద్రాలలో పని చేస్తున్న వీఆర్‌ఏలకు దరఖాస్తులు అందజేసి కార్డులు పొందాలని సూచించారు. గ్రామాల కార్యదర్శులు, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

14న 'ఏ షామ్ మస్తాని-15'

నగరంపాలెం: ఈ నెల 14న గుంటూరు రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సమర్పణలో గీతాంజలి ఆర్కెస్ట్రా గాయనీ, గాయకులతో ఏ షామ్ మస్తాని-15 నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత హిందీ సినీ గీతాలతో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని, పాడుతా తీయగా గాయని లలిత హాజరవుతారని అన్నారు. వివరాలకు 9848365751 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అల్లూరి త్యాగం అజరామరం

వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న లాంఫాం శాస్త్రవేత్తలు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అల్లూరి, రంగాకు నివాళులర్పించిన అంబటి మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: స్వాతంత్రోద్యమంలో బ్రిటీష్ వారి ఆకృత్యాలకు వ్యతిరేకంగా, ప్రజల హక్కుల కోసం పోరాడిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి, రంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటంలో బ్రిటీష్ వారికి కంటిపై నిద్ర లేకుండా గడగడలాడించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. నిర్లక్ష్యానికి గురైన వారి అభ్యున్నతి కోసం అల్లూరి త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో అందరికీ మేలు జరిగేలా కృషి చేయాలన్నారు.

లాంఫాంలో అల్లూరి జయంతి వేడుకలు

గుంటూరు రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్వీవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందు స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ



టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఆనంద్ చెస్ వింగ్స్ గుంటూరు సంయుక్తంగా జూలై 7వ తేదీన చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, ఆనంద్ చెస్ అకాడమీ డైరెక్టర్ గోపీనాథ్‌లు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది రౌండ్లు జరుగుతాయన్నారు. విజేతలకు రూ.44,444 బహుమతిగా అందజేయటం జరుగుతుందన్నారు. ఓపెన్ కేటగిరీ టోర్నమెంట్‌లో అండర్ 7, 9, 11, 13, 15 వయసు గల బాల బాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేయడం జరుగుతుందన్నారు. జనరల్ కేటగిరీలో మొదటి ఐదుగురికి బెస్ట్ మెడల్, బెస్ట్ ఉమెన్ క్యాటగిరీ, బెస్ట్ అకాడమీ, బెస్ట్ స్కూల్ ఇలా వివిధ రకాలుగా బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.450 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు 9703049378 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'మాదిగ జన జాతర' విజయవంతానికి పిలుపు



కరపత్రం ఆవిష్కరించిన నాయకులు

తెనాలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో జరగనున్న 'మాదిగ జన జాతర'ను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కఠెవరపు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. రూరల్ మండల గ్రామం కంచర్లపాలెంలో గురువారం మాదిగ జన జాతర కార్యక్రమానికి సంబంధించిన 'హలో మాదిగ..ఛలో ఈదుమూడి' కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిన ఈదుమూడి మాదిగ జాతి ప్రజలకు పుణ్యభూమి, పవిత్రభూమిగా ఆయన అభివర్ణించారు. జన్మభూమి రుణం తీర్చుకోవటానికి మాదిగ జాతి ప్రజలంతా జన జాతరలో పాల్గొనాలని కోరారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, జిల్లా కన్వీనర్ కొమరాల శ్రీనివాసరావు మాదిగ, ఎల్లమట్టి దాసు మాదిగ, జిల్లా కో కన్వీనర్ కిన్నెర నాగరాజు మాదిగ, కంచర్లపాలెం గ్రామ యూత్ కోపల్లె రవినాయుడు, కఠెవరపు జోనేష్, దేవరపల్లి రోశయ్య, కొక్కిలిగడ్డ సుధాకర్, నందూరి కోటి, రామస్వామి, ఎర్రగుంట్ల విజయ్‌బాబు, కోపల్లి సురేష్, వేజెండ్ల నాని, కఠెవరపు అఖిలాష్, కఠెవరపు అభి, వేజెండ్ల మంగయ్య, ఎర్రగుంట్ల మధుబాబు, జడ సంసోను, కఠెవరపు సాత్విక్, బుల్ల మనోజ్, వేమూరి గోపి, పి.కళ్యాణ్, కఠెవరపు లూథర్, కోపల్లి నాసూ, బుల్ల రాజేష్ పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్



కళాశాల బస్సులను నిలిపివేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: నీట్ పరీక్షా ఫలితాలపై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్లు లీక్ కావడాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం తెనాలి పట్టణంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. పట్టణంలోని పలు విద్యా సంస్థలకు యూనియన్ నాయకులు వెళ్లి విద్యార్థులను బయటకు పంపారు. బస్సులను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలలో 720కి 720 మార్కులు ఆరుగురికి రావటం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయటంతో పాటు దానిని నిర్వహించిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరారు.

విద్యార్థి నాయకులపై గతంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. జిల్లా నాయకులు మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అయ్యిందని పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం స్పందించకపోవటం బాధకరమని తెలిపారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గండు శివ, భూమేష్, పాశం వినయ్, గౌతమ్, చక్రి, శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకులు వసంత్, వై శశికాంత్, భాను వెంకటసాయి, పలు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరవశింపజేసిన వైద్యనాథన్ గాత్ర కచేరీ



వైద్యనాథన్ బాల సుబ్రమ్మణ్యం గానాలాపన

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీ సీతారామ గాన సభ 77వ వార్షిక శాస్త్రీయ సంగీత ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం జరిగిన గాత్ర సంగీత కచేరీ సంగీతాభిమానులను పరవశింపజేసింది. స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సాయంత్రం ఏర్పాటైన వేడుకలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు వైద్యనాథన్ బాల సుబ్రమణ్యం గాత్ర కచేరీ జరిగింది. తొలుత విఘ్నేశ్వర స్వామి కీర్తనతో ఆరంభించి త్యాగరాయ స్వామి, నీలకంఠ స్వామి దీక్షితులు, కేవీ రామకృష్ణ స్వామి కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు.

మంచి గాత్రం, చక్కని స్వరాలాపనతో వీనుల విందైన రాగాలతో కూడిన గానాలాపనను పెద్ద సంఖ్యలో విచ్చేసిన సంగీతాభిమానులు ఆసాంతం శ్రద్ధగా విన్నారు. వైద్యనాథన్ బాలసుబ్రహ్మణ్యం గాత్రానికి, హైదరాబాద్‌కు చెందిన కోమండూరి అనంత శౌరిరాజన్ వయోలిన్‌పై, విజయనగరం కళాకారుడు మండపాక రవి మృదంగంపై వాయిద సహకారం అందించారు. శ్రీ సీతారామ గాన సభ అధ్యక్షురాలు పిరాట్ల రమణి, కార్యదర్శి దుర్భా హరిబాబు శాస్త్రి, సహాయ కార్యదర్శి కేవీ రామకృష్ణ, ఉపాధ్యక్షులు దుర్భా కౌండిన్యసాయి, సభ్యులు పరుచూరి సుబ్బారావు, డాక్టర్ చింతలపాటి మంజుల, దుర్భా జస్వంత్ పాల్గొన్నారు. సంగీత ఉత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రముఖ హరికథా కళాకారుడు డాక్టర్ ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రిచే భక్త రామదాసు హరికథా కాలక్షేపం ఉంటుందని తెలియజేశారు.

దోమల నివారణకు ఫాగింగ్



తాడికొండ: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తాడికొండ పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. చెరువులు, బావుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు, మురుగు నిల్వ ఉంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని స్థానికులకు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిది మంది వేద పండితులు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: బైకులు చోరీ చేసిన నిందితుడిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లాకు చెందిన ఎస్.విద్యాధర్ గుంటూరు నగరంలో పలుచోట్ల 8 ద్విచక్ర వాహనాలు చోరీ చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విద్యాధర్‌ను గురువారం అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

• అదేవిధంగా సికింద్రాబాదుకు చెందిన రమావత్ రవి గుంటూరు నగరంలో పలు చోరీలకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

మానికొండ సూర్యవతికి ఘన నివాళి

తాడేపల్లి రూరల్ : మహిళా ఉద్యమ నాయకురాలు మానికొండ సూర్యవతి వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కేబీ భవన్‌లో నిర్వహించారు. కె.సరోజిని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి సూర్యవతి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సూర్యవతి చిన్నతనం నుంచి కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై.. భర్త మానికొండ సుబ్బారావు సహకారంతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. నందుమూరు సర్పంచ్‌గా, ఉంగుటూరు మండల అధ్యక్షురాలిగా ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. ఉంగుటూరు మండలంలో 18 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి, ఆనాటి జిల్లా కలెక్టర్‌తో ఉత్తమ ప్రజా ప్రతినిధిగా ప్రశంసలు పొందారని తెలిపారు. భూస్వామి కుటుంబంలో జన్మించినప్పటికీ పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేశారన్నారు. మహిళా నాయకురాలు అమలాశ్రీ, శ్రీదేవి, కృష్ణ తులసి పాల్గొన్నారు.

కలెక్టర్ న్యాయం చేయాలి



ఫిరంగిపురం: గరుడాచలపాలెంలో గత ఎన్నికల ఫలితాల అనంతరం దళితులపై జరిగిన దాడి పరిణామాలపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై బుధవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి బాధితుడు, దళిత నాయకుడు జి.రాజ సుందరబాబు ఆధ్వర్యంలో తమపై జరిగిన దాడిని గురించి వివరించారు. దీంతో గురువారం ఆర్డీవో ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేసేందుకు తహసీల్దారు రాఘవేంద్రరావు వెళ్లారు. దీంతో మహిళలు తమకు న్యాయం చేయాలని, కలెక్టర్, ఎస్పీ రావాలని, వారికే తమ సమస్యలు వివరిస్తామని చెప్పారు. అనంతరం న్యాయం కావాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి



నంబూరులో వరి విత్తన నిల్వలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

పెదకాకాని: లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో గురువారం విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఎవరైనా విత్తనాలు అమ్మితే రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత బిల్లులను పంట సీజన్ పూర్తి అయ్యే వరకూ జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. బిల్లులు లేకుండా విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా విత్తనాలు అమ్మినా, ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మకాలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాల నిల్వలు, కొనుగోలు బిల్లులు అనుమతులకు సంబంధించి తనిఖీలు చేశారు. నంబూరు గ్రామంలోని గ్రేయిన్స్ అండ్ సీడ్స్ పేరుతో జరుగుతున్న ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. విత్తనాలను సేకరించి నమూనాలను విత్తన పరీక్ష కేంద్రానికి పంపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు రంగా

వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అంబటి మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం ప్రజల ఆశాజ్యోతి వంగవీటి రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వంగవీటి రంగా విగ్రహానికి అంబటి మురళీకృష్ణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, అమిరినేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా రంగా నిలిచారన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారంటే అది ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. రంగా ఆశయాలను నెరవేర్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాము, బొద్దులూరి రంగారావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



కళాశాల బస్సును ఆపి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

తాడేపల్లిరూరల్ : నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బంద్ విజయవంతమైనట్లు ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్, కో-కన్వీనర్ వై.శివ గోపి, మత్తె అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, తీవ్ర అవకతవకలు, వ్యత్యాసాలతో బాధ్యతరాహిత్యంగా పరీక్షలు నిర్వహించారని విమర్శించారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో రోడ్ వద్ద, విట్, ఎస్ఆర్ఎం, ఎన్నారై, ఎస్ఆర్‌కే కాలేజీ బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశామన్నారు. మంగళగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి స్కూల్స్, కాలేజీల విద్యార్థులను బంద్‌లో పాల్గొని, సహకరించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పాలసీల కారణంగా ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గించడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక పద్ధతిలో అయినా టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు హనోక్ బాబు, అజయ్, వై.మణికంఠ, ఎ.వంశీ, మణి, ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్ అలీ ఖాన్, వెంకట్, సాయి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



రోడ్డు వెంట మురుగు నీరు బయటకు పోవటానికి కాలువ తీస్తున్న దృశ్యం

తూములూరు(కొల్లిపర): వర్షాకాలం మొదలు కావటంతో పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, వార్డు మెంబర్లు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు గ్రామంలో గ్రామ వార్డు మెంబర్ అవుతు సుధాకర్ రెడ్డి , కూటమి నాయకులతో కలసి గ్రామ సందర్శన చేశారు. ఎస్సీ కాలనీ వద్ద నుంచి పీర్ల చావిడి సీసీ రోడ్డు వరకు సుమారు 300 మీటర్లు వరకు వర్షం కారణంగా నీరు నిల్వ ఉండటం జరుగుతుందని దీని వలన బడికి వెళ్లే విద్యార్థులు, మహిళలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సర్పంచ్, కార్యదర్శి మృత్యుంజయరావు స్పందించి మురుగు నీరు బయటకు పోవటానికి ప్రొక్లెయిన్ ద్వారా రోడ్డు వెంబడి సన్న కాలువ తీసి రోడ్డుపై ఉన్న మురుగు నీటిని బయటకు పంపే ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ ఆధ్వర్యంలో వెంటనే సిమెంట్ తూములు వేయించి ఈ సమస్య రాకుండా పరిష్కరించాలని వార్డు మెంబర్ అవుతు సుధాకర్ రెడ్డి కోరారు. దీనిపై పరిశీలించి సమస్య రాకుండా ఏటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందన్న అంశాలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చేయటం జరుగుతుందని సర్పంచి స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి కోటిరెడ్డి, జనసేన నాయకుడు కట్టా శ్రీహరిరెడ్డి, చాగంటి సుబ్బారెడ్డి, బడుగు వంశీ, కొండా కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండా శ్రీనివాసరెడ్డి కుటుంబానికి అండ



నగదు చెక్కు అందజేస్తున్న దయాసాగర్

తాడికొండ: మండల పరిధిలోని తాతిరెడ్డిపాలెం గ్రామంలో మార్చి 14న లిఫ్ట్ ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్ కొండా శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.5 లక్షలు ప్రమాద బీమా ఇచ్చారు. గురువారం సాయంత్రం గుంటూరు కార్యాలయంలో కొండా శ్రీనివాసరెడ్డి కుమారుడు నాగ మల్లేశ్వరరెడ్డి మేకతోటి దయసాగర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ చేసిన ప్రమాద బీమాను త్వరగా మంజూరు చేయించి నందుకు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. తాడికొండ మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ళా శ్రీనివాసరెడ్డి, మాదాను సురేష్, షేక్ జానీ పాల్గొన్నారు.